క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్ రామసుందర రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న సెంచూరియన్ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. రామసుందర రెడ్డిని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సందర్శనకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో చాన్సలర్ జీఎస్ఎన్‌రాజు, వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

నెల్లిమర్ల: బీఎల్ఓలు ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని తహసీల్దార్ కె. శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్ జగన్నాథం ఆధ్వర్యంలో బీఎల్ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పాత, కొత్త ఓటర్ల జాబితాల మ్యాపింగ్ ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం



కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ఖలీల్‌బాబు, తదితరులు

విజయనగరం టౌన్: నూతన కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డిని బాబామెట్టలోని ప్రముఖ సూఫీ క్షేత్రం హజరత్ బాబా సయ్యద్ ఖాదర్ షా వలీ దర్గా ప్రతినిధి డాక్టర్ మహ్మద్ ఖలీల్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. త్వరలో జరగనున్న ఖాదర్ బాబా జయంతికి రావాలని ఆహ్వానించారు. అదేవిధంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి కూడా ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై దృష్టి



ఎస్పీని కలిసిన బాల సంరక్షణ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు

విజయనగరం క్రైమ్: బాలికల భద్రతపై పోలీస్ శాఖ దృష్టి పెడుతోందని ఎస్పీ దామోదర్ తెలిపారు. గురువారం స్థానిక డీపీఓలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ గొట్టేటి హిమబిందు ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలబాలికల రక్షణ, భద్రత, సంక్షేమం వంటి అంశాలపై ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ కూడా పాల్గొని ఫ్యామిలీ కౌన్సెలింగ్, గృహహింస వంటి అంశాలపై ఎస్పీతో సమీక్షించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



విద్యార్థుల నృత్య ప్రదర్శన

విజయనగరం రూరల్: శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రం రామనారాయణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన సరస్వతీ నృత్య కళామందిర్ విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

ఘనంగా దీనదయాళ్ జయంతి

విజయనగరం అర్బన్: పట్టణంలోని సాయి గాయత్రీ బీఎడ్ కళాశాలలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భవానీ మాట్లాడుతూ..దేశం పట్ల ప్రేమ, విధేయత కలిగి ఉన్న దీనదయాళ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అప్పారావు, రాంబాబు, డి.శ్రావణి, జె.హేమలత, ఎం.దుర్గాప్రసాద్, టి.శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కోపమొచ్చింది..

- సచివాలయ కార్యదర్శుల తీరుపై మండిపాటు
- 55 మంది కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ
- సమావేశానికి అలస్యంగా రావడం, గైర్హాజరుపై చర్యలు



సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు కోపం వచ్చింది. వార్డు సచివాలయ కార్యదర్శుల పని తీరుపై విసుగు చెందిన ఆయన చర్యలకు ఉపక్రమించారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.... ఒకే సారి 55 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. వివిధ సందర్భాల్లో నిర్వహించే సమావేశాలకు నిర్దీత సమయాని కన్నా ఆలస్యంగా రావడం, ఇంకొందరకు పూర్తిగా డుమ్మా కొట్టడంతో క్రమశిక్షణారాహిత్యంగా గుర్తించి వారి నుంచి లిఖితపూర్వకంగా సంజాయిషీని కోరారు. అయితే ఒకే సారి 55 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం కార్పొరేషన్‌లో కలకలంగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీ - 4 కార్యక్రమం అమలుపై బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నగరంలోని 50 డివిజన్‌లలో ఉన్న 60 వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, ఉమెన్ ప్రొటెక్షన్, శానిటేషన్, వెల్ఫేర్ కార్యదర్శులను ఆహ్వానించారు. ఇందులో కొంత మంది నిర్ణీత సమయానికి హాజరుకాగా.... ఇంకొందరు ఆలస్యంగా, మరికొందరు సమావేశానికి రాకపోవడాన్ని గుర్తించారు. దీంతో ఆలస్యంగా వచ్చిన వారితో పాటు సమావేశానికి గైర్హాజరైన 21 మంది రెవెన్యూ కార్యదర్శులకు, 19 మంది ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులకు, 8 మంది శానిటేషన్ కార్యదర్శులకు, 7గురు వెల్ఫేర్ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేశారు.

మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో..

ప్రజలకు మెరుగైన పౌర సేవలందించాలనే ముఖ్య ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అప్పట్లో అధికారుల నిత్య పర్యవేక్షణతో కార్యదర్శులుగా నియామకమైన వారు సేవలందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను గాలికొదిలేయడంతో ఉద్యోగులు ఎవరికి నచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు కార్యదర్శులు సచివాలయాల్లో ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదంటూ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లే ఫిర్యాదులు చేస్తుండడం గమనార్హం. అంతేకాకుండా అధికారిక సమావేశాలకు కూడా హాజరుకాకపోవడంతో పరిస్థితి చివరకు షోకాజ్ నోటీసుల వరకు దారి తీసింది. ఇప్పటికైనా సచివాలయ ఉద్యోగుల్లో మార్పు వస్తుందో.. లేదో వేచి చూడాలి.

చర్యలు తప్పవు..

విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన 55 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులిచ్చాం. పాలనను గాడిలో పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నాం. నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవు.

– పల్లి నల్లనయ్య, కమిషనర్

పరిపాలనలో పారదర్శకత

- ఎంపీడీఓ స్వరూపారాణి



సమీక్ష సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు

భోగాపురం: పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ స్వరూపారాణి సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ..పంచాయతీల్లో పాలనాపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో కీలకమైన అంశాలైన తాగునీరు సరఫరా, పారిశుధ్యం నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



డెంకాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయధికారులు, వ్యవసాయ విద్యార్థులు

డెంకాడ: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మండలంలోని డెంకాడలో వరి పంటపొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనగరం ఏరువాక కేంద్రం వ్యవసాయధికారులు, అధికారులు విద్యార్థులకు వరి పంటకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంటీయూ 1426, తదితర రకాల వరి పంటల సాగును వారు పరిశీలించారు. కార్యక్రమంలో విజయనగరం ఏడీఏ ఎ.నాగభూషణం, ఏఓ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

విజయనగరం అర్బన్: విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా రెండు మేజర్ కోర్సులకు కమిషనర్ ఆమోదం తెలిపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్రం, బోటనీ విభాగాల్లో అదనంగా మేజర్ కోర్సులు ప్రారంభించేందుకు అనుమతి లభించిందని పేర్కొన్నారు. దీంతో కళాశాలలో ఇప్పటివరకు అమలవుతున్న ఎనిమిది కోర్సులతో పాటు కొత్తగా రానున్న రెండు కోర్సులతో మొత్తం పది మేజర్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రెండోదశ అడ్మిషన్లు ఈ నెల 26 తేదీ నుంచి ప్రారంభమవుతాయని, మొదటి దశలో ఇచ్చిన వెబ్ ఆప్షన్లు 3వ తేదీన మార్చుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ఫైనల్ లిస్ట్ 6న విడుదల చేస్తామన్నారు.

మండల కేంద్రాల్లో గ్రంథాలయాలు



విశాలాంధ్ర బుక్‌హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు

విజయనగరం గంటస్తంభం: ప్రతి మండల కేంద్రంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి రాష్ట్ర సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గురజాడ గ్రంథాలయంలో విశాలాంధ్ర బుక్‌హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత సోషల్ మీడియా ప్రభావంలో పుస్తకాల పట్ల ఆసక్తి కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఫోన్లకు బదులు పుస్తకాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, విశాలాంధ్ర ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

యూబీఐ ఆధ్వర్యంలో కార్ కార్నివాల్



ఖాతాదారులకు కారు తాళం అందజేస్తున్న బ్యాంక్ జనరల్ మేనేజర్ శాలిని మీనన్

విజయనగరం అర్బన్: యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని కంటోన్మెంట్ శాఖ వద్ద దసరా ఉత్సవాల నేపథ్యంలో కార్ కార్నివాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు అత్యల్ప వడ్డీ రేట్లతో కారు రుణాలు మంజూరు చేశారు. అనంతరం యూబీఐ జనరల్ మేనేజర్ శాలిన మీనన్ మాట్లాడుతూ.. జిల్లాలోని సుమారు 70 శాఖల ద్వారా రూ.8 వేల కోట్ల వ్యాపారం కొనసాగిస్తున్నామని తెలిపారు. దసరా సందర్భంగా వడ్డీ రేట్లు తగ్గించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ జితేంద్ర శర్మ, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు శ్రీనివాసు, రాజా, పట్టణంలోని వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట చేరుకున్న సిరిమాను



హుకుంపేటలో పూజారి ఇంటివద్ద ఉన్న సిరిమాను

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో సాక్ష్యాత్కరించిన సిరిమాను, ఇరుసుమానులను బుధవారం రాత్రి హుకుంపేటకు తీసుకువచ్చారు. స్థానిక మహిళలు సిరిమానుకు పసుపు, కుంకుమలు, ముర్రాటలు సమర్పించారు. త్వరలోనే సిరిమాను పనులు ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. మండలంలోని కొప్పెర్లలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు బావిశెట్టి నారాయణరావు సహకారంతో గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పిచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, సువ్వానిపేట, తుమ్మలపేట, సువ్వానిపేట, దన్నానపేట, కోరాడపేట, తంగుడుబిల్లి, ఏటీ అగ్రహారం, ఆల్తిపాలెం, మొయిద, నారాయణపట్టణం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట గ్రామాలకు.. గుర్ల మండలంలోని చింతలపేట, పెద మజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జానపద గీతాలను ఆదరిస్తారు..

విజయనగరం టౌన్: జానపద గీతాలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారని, తాను ఢీ షోలో పాడిన పాటను ఐదు మిలియన్‌ల మంది యూట్యూబ్‌లో వీక్షించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఢీ షో సింగర్ సురేష్ తెలిపారు. కణపాకలో ఉన్న అన్నదాత సుఖీభవ సంస్థ ప్రతినిధులు సురేష్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పాడిన జానపద గీతాన్ని లక్షలాది మంది ఆదరించడం జీవితంలో మరువలేనన్నారు. అన్నదాత సుఖీభవ సంస్థ నిర్వాహకురాలు కాంచన మాట్లాడుతూ..నెల్లిమర్ల మండలం బొప్పడాంలో జన్మించిన సురేష్ ఢీ షో ద్వారా ప్రజల ఆదరణ పొందడం మన జిల్లాకు గర్వకారణమన్నారు.

సైబర్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- డీఐజీ గోపీనాథ్ జెట్టీ



మహిళా పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

విజయనగరం క్రైమ్: సైబర్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన గురువారం స్థానిక రూరల్, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీ ఫైళ్లను పరిశీలించారు. సైబర్, గంజాయి, వేధింపుల కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ గోవిందరావు, విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ లీలారావు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ వ్యాఖ్యలు సరికాదు



రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల: శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహచర మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. శాసనమండలిలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడుతుండగా.. మంత్రి లోకేష్ పరుష పదజాలంతో అవమానించారన్నారు. అలాగే అభివృద్ధిపై జరిగిన చర్చలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణపై కూడా లోకేష్ మాట్లాడిన మాటలు విమర్శకు దారి తీసిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరై నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్‌లో కేక్ కట్ చేస్తున్న వీసీ పీకే మహంతి, విద్యార్థులు

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



విజయనగరం ఫోర్ట్: కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమని డీఎంహెచ్‌ఓ ఎస్. జీవనరాణి అన్నారు. గురువారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో కూడా వైద్యులతో పాటు ఫార్మసిస్టులు విలువైన సేవలు అందించారని తెలిపారు. రోగులకు మందులు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యులు ఏ మందులు రాస్తే వాటినే రోగులకు అందజేయాలని తెలిపారు. వ్యాక్సిన్లు భద్రపరచడంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అల్లు పద్మజ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ ఎన్.భారతి, ఫార్మసిస్టుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సన్యాసినాయుడు, జిల్లా అధ్యక్షుడు బీహెచ్‌వీ ప్రసాద్, సంఘ నాయకులు పెంకి ఇజ్రాయిల్, యడ్ల జోగారావు, బి. నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పీకే మహంతి మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉంటూ సమాజానికి ఉత్తమ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె బకాయిల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్



దుకాణాల అద్దెల వసూళ్లలో కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న దుకాణాల దీర్ఘకాల అద్దె బకాయిలను రాబట్టేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు నేతృత్వంలోని అధికారుల బృందం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి బకాయిలు రాబడుతున్నారు. స్థానిక జనతా బజార్‌లోని 72 దుకాణాలలో 18 దుకాణదారులు దీర్ఘకాలికంగా బకాయిలు చెల్లించలేదు. దీంతో వారి వద్దకు గురువారం వెళ్లి 13 దుకాణాలకు సంబంధించి రూ.2,93,000 అద్దె బకాయిలు వసూలు చేశారు. మిగిలిన ఐదు దుకాణాలలో నాలుగింటిని సీజ్ చేశారు. ఒక దుకాణదారుడు త్వరలోనే చెల్లిస్తానని గడువు కోరడంతో సమ్మతించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ.. దీర్ఘకాల బకాయిలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా...?



మాట్లాడుతున్న ఎల్లాజీ , కిరణ్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయికుడు, మాజీ సర్పంచ్ దంగా భూలోక ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న విషయమై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఎల్లాజీ, విజ్జపు కిరణ్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కోనాడ రెవెన్యూ పరిధిలో గల సర్వేనంబర్ 44–2లో 36 సెంట్లను ఆక్రమించిన మాజీ సర్పంచ్ భూలోకపై రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికే ఆ భూమిని తప్పుడు సర్వే నంబర్‌తో జిరాయితీగా మార్చుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పిన్నింటి అప్పలనారాయణ ఉన్నారు.

దుర్గమ్మా శరణు... శరణు..



విజయనగరం టౌన్: కాత్యాయనీదేవీ అలంకరణలో దుర్గాదేవి

విజయనగరం/విజయనగరం టౌన్: నగరంలోని అరుంధతీనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడి ఆవరణలో దుర్గాదేవి కాత్యాయని అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు.



విజయనగరం: సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు